సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 19 । ఫిబ్రవరి । 2025



విద్యా సంస్థల్లో క్రీ'డల్'

విద్యా సంస్థల్లో క్రీడలపై క్రీనీడ పడింది. ఫిజికల్ డైరెక్టర్లు లేరు.

- 8లో



ఉద్దానంలో ఎలుగు సంచారం

ఉద్దానంలో ఎలుగు సంచరిస్తోంది. దీన్ని తప్పించబోయి ఒకరు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు.

- 8లో

కృష్ణా యూనివర్సిటీ వీసీగా పొందూరు వాసి



పొందూరు: మండలంలోని పెను బర్తి గ్రామానికి చెందిన కూన రామ్‌జీ విజయవాడలోని కృష్ణా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు విడుదలయ్యాయి. గతంలో రామ్‌జీ ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీగా పనిచేశారు.

న్యూస్‌రీల్

పోలీసుల అదుపులో గంజాయి బ్యాచ్

- దొరికిన వారంతా ఎంబీఏ, ఎంటెక్ విద్యార్థులే

శ్రీకాకుళం రూరల్: జిల్లా కేంద్రంలోని పాత్రునివలస పరిధిలోని టిడ్కో కాలనీ పరిసర ప్రాంతంలో మంగళవారం సాయంత్రం శ్రీకాకుళం నగరానికి చెందిన ఆరుగురు వ్యక్తులు సీక్రెట్‌గా గంజాయి సేవిస్తుండగా రూరల్ పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. దొరికిన వారంతా ఎంబీఏ, ఎంటెక్ చదువుతున్న వారే కావడం గమనార్హం. అయితే ఇందులో విశాఖపట్నంకు చెందిన వారు ఇద్దరు కాగా, శ్రీకాకుళానికి చెందిన వారు నలుగురు ఉన్నారు. వీరంతా శ్రీకాకుళంలోని ఓ కాలేజీలో చదువుతున్నట్లు తెలుస్తోంది. పట్టుబడిన వారి వద్ద నుంచి అరకిలోకు పైగానే గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఇదే విషయంపై టౌన్ సీఐ పైడపునాయుడును వివరణ కోరగా ఆరుగురు గంజాయి సేవిస్తూ పట్టుబడినట్లు చెప్పారు. ఎంత మోతాదుల్లో గంజాయి స్వాధీనం చేసుకున్నారని ప్రశ్నించగా కేవలం 50-60 గ్రాములు మాత్రమే వారివద్ద ఉందన్నారు. వీరిపై కేసు నమోదు చేయ లేదని, ప్రస్తుతం విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

విదేశీ ఉద్యోగాలంటూ మోసం



కోటబొమ్మాళి ఇన్‌స్టిట్యూట్ వద్ద ఆందోళన చేస్తున్న యువకులు

సంతబొమ్మాళి: విదేశాల్లో ఉద్యోగాల పేరుతో కోటి రూపాయలకు టోపీ వేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. నర్సాపురం పంచాయతీ బడే నర్సాపురం గ్రామానికి చెందిన మోడీ భాస్కర్‌రెడ్డి కోటబొమ్మాళిలో శ్రీమారుతి వెల్డింగ్ ఇన్‌స్టిట్యూట్ నిర్వహిస్తున్నారు. ఇటలీలో ఉద్యోగాలంటూ ఇన్ స్టిట్యూట్‌లో పలువురు యువకులకు ఇంటర్వ్యూలు నిర్వహించి వారి వద్ద నుంచి సుమా రు కోటి రూపాయలు వరకు వసూలు చేశారని బాధితులు తెలిపారు. గడువు దాటినా ఉద్యోగాలు రాకపోవడంతో మోసపోయామని గ్రహించిన యువకులు మంగళవారం కోటబొమ్మాళి ఇన్‌స్టిట్యూట్ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. వారికి సమాధానం చెబుతూ బడే నర్సాపురంలో ఉన్న ఇంటికి వెళ్లడంతో అక్కడకు వెళ్లిన బాధితులు భాస్కర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. తమ వద్ద తీసుకున్న డబ్బులు వెంటనే ఇవ్వాలని పట్టుబట్టి ఆందోళన చేపట్టారు. మీరు ఇచ్చిన డబ్బులను ఏజెంట్‌కు ఇచ్చి తాను మోసపోయానని భాస్కర్‌రెడ్డి సమాధానం ఇచ్చారు. శాంతించని యువకులు నిలదీయడంతో.. వారి నుంచి తప్పించుకొని బైక్‌పైన కోటబొమ్మాళి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. అక్కడ కూడా బాధిత యువకులు ఆందోళన చేపట్టారు.

శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ. 3.33 లక్షలు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, అర్చకులు

జలుమూరు: శ్రీముఖలింగేశ్వరుని హుండీ ఆదాయం రూ.3,33,634 వచ్చినట్లు ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు మంగళవారం తెలిపారు. 84 రోజులకు గాను ఈ ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ హామీ ఏమైంది..?



మాట్లాడుతున్న మొజ్జాడ యుగంధర్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెగా డీఎస్సీపైనే తొలి సంతకం అని చెప్పి నేటికీ భర్తీ చేయకపోవడం దారుణమని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు మొజ్జాడ యుగంధర్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాసరావులు ప్రశ్నించారు. శ్రీకాకుళం నగరంలో ఎన్.ఆర్ దాసరి క్రాంతి భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నోటిఫికేషన్ లేక లక్షలాది మంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లలో లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారని తెలిపారు. అలాగే ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేసే కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ప్రభుత్వం అధికారంలోకి వస్తే 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న పెద్దలు ఎన్ని ఉద్యోగాలు కల్పించారో చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఎస్. రామోజీ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సిక్కోలుపై గంజాయి పంజా






- జిల్లాలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు
- మత్తులో నేరాలకు పాల్పడుతున్న యువత
- కట్టడి లేదని అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజా ప్రతినిధులు

ప్రశాంత సిక్కోలుపై గంజాయి పంజా విసురుతోంది. ముఖ్యంగా యువతను మత్తుకు బానిసలుగా చేసి నేరప్రవృత్తిని పెంచుతోంది. జిల్లాలో గంజాయి దొరకని పట్టణమంటూ లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతి టౌన్‌కు సినిమా థియేటర్, బస్టాండ్, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నంత సాధారణంగా... గంజాయి విక్రయ కేంద్రాలు మెయింటైన్ చేస్తున్నారు. దాడులు జరుగుతున్నా.. కిలోల కొద్దీ గంజాయి పట్టుబడుతున్నా.. నిందితులను అదుపులోకి తీసుకుంటున్నా ఈ విక్రయాలు మాత్రం ఆగడం లేదు. జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో గంజాయి విక్రయ కేంద్రాలు పరిశీలిస్తే.. -శ్రీకాకుళం క్రైమ్

ఆమదాలవలసలో..



- బీఆర్‌నగర్‌లోని ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఇటీవల కొంతమంది గంజాయి సేవిస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు.
- ఒడిశా నుంచి రైళ్లలో బ్యాగుల్లో పట్టుకుని వచ్చి ఎదురుగా ఉండే ఒకట్రెండు లాడ్జీల్లో మకాం వేసి క్రయ విక్రయాలు జరుపుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇచ్ఛాపురం టౌన్ పరిధిలో..

- రైల్వేస్టేషన్ శివార్లు, ఎల్‌మ్యాక్స్ సమీప పొదలు, బెల్లుపడ కాలనీ శివారు, పురుషోత్తపురం శివార్లు గంజాయి విక్రయాలకు అడ్డాలుగా ఉన్నాయి.
- ఈ ప్రాంతాల్లో ఇటీవల ఎనిమిది మందిని పట్టుకున్నారు.
- కంచిలి రైల్వేస్టేషన్ సమీపంలో పొట్లాల్లో క్రయ విక్రయాలిప్పుడిప్పుడే స్టార్ట్ అవుతున్నాయి.

జిల్లా కేంద్రంలో..

- నగరంలోని ఉమెన్స్ కళాశాల చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు ఎప్పటి నుంచో ఆరోపణలు ఉన్నాయి.
- డచ్‌బంగ్లా వెనుక ఖాళీ స్థలం కూడా వీరి అడ్డానే.
- అఫీషియల్‌కాలనీ ఫైర్ ఆఫీస్, ఆర్‌అండ్‌బీ సమీప సబ్‌పోస్టాఫీస్‌లలో రాత్రి వేళ చూస్తే భయం పుట్టక మానదు.



అదేమీ శివారు ప్రాంతం కాదు.. నిర్మానుష్య ప్రాంతం అంతకంటే కాదు. దాదాపు నగరం నడిబొడ్డున.. అది కూడా పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని పొట్టి శ్రీరాములు మార్కెట్‌లో ఇద్దరు యువకులు గంజాయి తీసుకుంటూ దొరికిపోయారు. అది కూడా వీరు సాక్షాత్తు స్థానిక ఎమ్మెల్యే కంట పడ్డారు. మార్కెట్‌ను సందర్శించేందుకు ఎమ్మెల్యే గొండు శంకర్ వస్తే ఈ బాగోతం బయటపడింది. జిల్లా కేంద్రంలో గంజాయి ఎంత విచ్చలవిడిగా దొరుకుతుందో ఎమ్మెల్యే సాక్షిగా ఘటన రుజువు చేసింది.

పలాస-కాశీబుగ్గ కేంద్రంగా..

- నగర శివార్లలోని హుద్‌హుద్ ఇళ్లు, కోసంగిపురం జగనన్న కాలనీ, సూదికొండ, నెమలికొండ, రైల్వేస్టేషన్ అంబుసోలి, బెండితోట రిజర్వ్ ఫారెస్టు, రైల్వే గ్రౌండ్‌లో గంజాయి సేవిస్తున్నట్లు ఆధారాలు ఉన్నాయి.
- రైల్వేస్టేషన్ సమీప ఆలయాలు, పలాస అన్నపూర్ణ సమీప పరిసరాల వద్ద సాధువులు అమ్ముతుంటారు.

మత్తులో నేరాలు - ఘోరాలు

- జిల్లా కేంద్రంలో ఇటీవల జరిగిన హత్య ఘటనలో నిందితుడిని ఇంటరాగేట్ చేసేందుకు పోలీసుల తల ప్రాణం తోకకు వచ్చింది. గంజాయి మత్తు దిగాక గానీ అతడు విచారణకు సహకరించలేదు.
- గత ఏడాది అక్టోబర్‌లో శ్రీకాకుళంలోనే ఓ యువకుడిపై మరొకరు బ్లేడుతో గొంతు కోసేశాడు.
- ఒడిశాకు చెందిన ఓ యువకుడు పచ్చని కాపురంలో ప్రేమ పేరుతో చిచ్చుపెట్టాడు. మత్తులో ఏకంగా హత్యకు పాల్పడ్డాడు.
- మరో ఘటనలో ఓ యువకుడు సొంత మేనమామ తమకు రావాల్సిన వాటాకు అడ్డుగా నిలుస్తున్నాడన్న కోపంతో స్నేహితుని సాయంతో మత్తులోనే కర్కశంగా చంపేశాడు.

నరసన్నపేటలో..

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో సులభ్‌కాంప్లెక్సు అడ్డాగా గంజాయి విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం.
- జమ్ము జంక్షన్ సమీప పరిసరాల్లోను, బజారులో రాజేశ్వరి టాకీస్ దగ్గర పల్లిపేట జంక్షన్ వెంకటేశ్వర థియేటర్ రాజుల చెరువు గట్టు మీద కాలనీలో, కొన్ని స్లమ్ ఏరియా ఉన్న కాలనీల్లో ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది.

టెక్కలిలో..

- జాతీయ రహదారి ఆనుకొని నిర్మానుష్య ప్రాంతాలు, తోటలు, ప్రైవేటు లేఅవుట్‌లు, వెంచర్లు, వంశధార కాలువ ఏరియా మత్తుపదార్థాల సేవనానికి కేరాఫ్‌లుగా నిలుస్తున్నాయి.
- టెక్కలిలో ఆంధ్రా ఒరిస్సా సరిహద్దులను కలిపే రైలు మార్గం ఉండటం, గుణుపూర్ నుంచే గంజాయి వస్తుందని స్థానికంగా చర్చజరుగుతోంది.

పట్టుకుంటున్నాం..



ఎస్పీ ఆధ్వర్యంలో గంజాయి అక్రమ రవాణా, క్రయ విక్రయాలపై పూర్తి దృష్టి పెట్టాం. నిత్యం ఎక్కడో చోట గంజాయిని పట్టుకుంటూనే ఉన్నాం. డ్రోన్ల ద్వారా కూడా గుర్తిస్తున్నాం. సమాజంలోనూ మార్పు అవసరం. పోలీసులకు ప్రజలు కూడా సహకరించాలి.

– సోమవారం పత్రికా విలేకరుల సమావేశంలో డీఎస్పీ సీహెచ్ వివేకానంద



మత్తు పదార్థాలకు అడ్డగా మారిన అఫీషియల్ కాలనీ సబ్ పోస్టాఫీసు భవనం పై భాగం

ఒడిశా టూ విశాఖ.. వయా సిక్కోలు



జిల్లాకు ఎక్కువగా ఒడిశా నుంచే గంజాయి వస్తోంది. అక్కడి నుంచి నేరుగా వైజాగ్‌కు ట్రాన్స్‌పోర్టు చేస్తూ మధ్యలో జిల్లా యువతనూ ఈ ఉచ్చులోకి లాగుతున్నారు. 2024లో జిల్లా మీదుగా 1322 కిలోల గంజాయి అక్రమంగా తరలిపోతూ పోలీసులకు పట్టుబడింది. గంజాయి పెడ్లర్లు దొరుకుతున్నారు గానీ వాటి మూలాలైన వ్యాపారులను పట్టుకోలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. ఇక సిగరెట్లలో పొగాకు తీసి గంజాయి పెట్టి విక్రయిస్తున్న దాఖలాలు కూడా కనిపించాయి.



డచ్‌బంగ్లా వద్ద గంజాయి ఆనవాళ్లు..

ఎస్‌బీఐ మెడకు సీఐడీ ఉచ్చు!

- సీఐడీ చేతికెళ్లిన నరసన్నపేట ఎస్‌బీఐ బ్రాంచి వ్యక్తిగత రుణాల అవినీతి బాగోతం
- అంతర్గతంగా తేల్చలేక సీఐడీకి అప్పగిస్తూ ఫైలు పెట్టిన బ్యాంకు ఉన్నతాధికారులు
- పరిశీలన దశలో ఉండటంతో నంబర్ ఖరారు చేయని సీఐడీ
- గార బ్రాంచి బంగారం మిస్సింగ్ కేసు తీర్పు కోసం ఎదురు చూపులు
- ఏం గుర్తించారో వెల్లడించని పరిస్థితి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: జిల్లాలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు చెందిన రెండు బ్రాంచిల్లో చోటు చేసుకున్న అక్రమాల వ్యవహారం మొత్తం ఆ బ్యాంకుకే మచ్చ తెచ్చిపెట్టింది. వీటిలో ఒకటి ఇప్పటికే కోర్టు పరిధిలో ఉండగా, మరొకటి సీఐడీ చేతికి వెళ్లింది. నరసన్నపేట బ్రాంచ్‌లో ఖాతాదారులకు తెలియకుండా ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత ఖాతాల మీదుగా రుణాలు డ్రా చేసిన నిర్వాకాన్ని సీఐడీకి అప్పగించాలని బ్యాంకు ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోగా, గార ఎస్‌బీఐలో తాకట్టు బంగారం మాయం కేసుకు సంబంధించి కోర్టు ఇచ్చే తీర్పు కోసం ఎదురు చూస్తున్నారు. నరసన్నపేట బ్రాంచ్‌కు సంబంధించి ఇప్పటివరకు సీఐడీ నంబర్ ఇవ్వలేదు. పలు డాక్యుమెంట్లతో కూడిన వివరాలను అడిగినట్టు తెలిసింది. అన్నీ పరిశీలించాకే కేసు నంబర్ ఇచ్చే అవకాశం ఉంది.

జాతీయ బ్యాంకుల్లో కోటి రూపాయలకు లోపు అక్రమాలు జరిగితే స్టేట్ పోలీసు డిపార్ట్‌మెంట్‌కు, రూ.మూడు కోట్ల లోపైతే సీఐడీకి, రూ.3 కోట్లు దాటితే సీబీఐకి కేసు అప్పగించాల్సి ఉంటోంది. నరసన్నపేట ఎస్‌బీఐ బ్రాంచిలో రూ.కోటికి పైగా అక్రమాలు జరిగినట్టు ప్రాథమికంగా బ్యాంకు అధికారులు గుర్తించినట్టు తెలిసింది. కచ్చితమైన లెక్క లేకపోయినా రూ.3కోట్ల లోపే అక్రమాలు జరిగినట్టు తేలడంతో కేసును సీఐడీకి అప్పగించాలని నిర్ణయం తీసుకున్నారు.

నరసన్నపేటలో ఏం జరిగిందంటే...

నరసన్నపేట బ్రాంచిలో ప్రభుత్వ ఉద్యోగుల ఖాతాలపై వ్యక్తిగత రుణాలను బ్యాంకు అధికారులే వాడేసినట్టు తెలిసింది. దీనికి సంబంధించి ఇప్పటికే బ్యాంకు ఉన్నతాధికారులు అంతర్గత విచారణ చేపట్టగా జరిగిన అక్రమాలను గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో రీజనల్ స్థాయి అధికారితో పాటు పలువురు బ్యాంకు ఉద్యోగుల ప్రమేయం ఉన్నట్టు సమాచారం. తొలుత విషయం బయటకు పొక్కడంతో నాడు పనిచేసిన బ్యాంకు మేనేజర్ శ్రీకర్ మెడకు చుట్టుకుంది. రీజనల్ స్థాయి అధికారి ఒత్తిడితో సుమారు రూ.65లక్షలు బ్యాంకుకు తిరిగి జమ చేసినట్టు తెలిసింది. ఈ సమయంలో తీవ్ర ఒత్తిడికి లోనై ఆత్మహత్యాయత్నం వరకు వెళ్లినట్టు సమాచారం. అక్రమాలు జరిగాయని శాఖా పరంగా గుర్తించడంతో నాడు రీజనల్ మేనేజర్‌గా పనిచేసిన రమణమూర్తిరాజును యుద్ధ ప్రాతిపదికన బదిలీ చేశారు. ఆ తర్వాత అప్పట్లో మేనేజర్‌గా పనిచేసిన శ్రీకర్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. అయినప్పటికీ శాఖా పరంగా విచారణ కొలిక్కి రాకపోవడంతో పాటు రూ.కోటికి పైగా అక్రమాలు జరగడంతో సీఐడీకి కేసు అప్పగించాలని ఎస్‌బీఐ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

కోర్టులో గార బ్రాంచ్ వ్యవహారం

గార ఎస్‌బీఐలో ఖాతాదారులు పెట్టిన బంగారాన్ని భద్రంగా ఉంచాల్సిందిపోయి వాటిని తీసుకెళ్లి కొందరు ఉద్యోగులు ఓ ప్రైవేటు సంస్థలో కుదవ పెట్టి కోట్ల రూపాయలు తీసుకుని సొంతానికి వాడుకున్నారు. దాదాపు 86 సంచుల్లోని రూ.4.7 కోట్ల విలువైన 7.146 కిలోలకు పైగా బంగారు ఆభరణాలు ఈ రకంగా పక్కదారి పట్టాయి. కేసుకు సంబంధించి కోర్టులో చార్జిషీట్ కూడా దాఖలు చేశారు. మిస్సయిన ఖాతాదారుల బంగారమంతా రికవరీ కావడంతో వ్యవహారం కొలిక్కి వచ్చేసిందని, కోర్టు తీర్పు ఇవ్వగానే ఎవరి బంగారం వారికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్టు బ్యాంకు అధికారులు చెబుతున్నారు. అయితే దీంట్లో కీలక వ్యక్తులు తప్పించుకున్నారని, ముఖ్యంగా రీజనల్ మేనేజర్ రమణమూర్తిరాజు పాత్ర చూపించకపోవడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. గత రిమాండ్ రిపోర్టు కూడా సక్రమంగా లేదని తర్వాత వచ్చిన పోలీసు అధికారులు అనుమానం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఆ మేరకు విచారణ కూడా చేశారు. కానీ ఏం గుర్తించారో వెల్లడి కాలేదు.

ఆర్‌ఎం రాజు పాత్రపై నేటికీ రాని స్పష్టత..

- గార ఎస్‌బీఐ కేసులో ఏ-1 ముద్దాయిగా పేర్కొన్న స్వప్నప్రియ 2023 అక్టోబరు నెలకు సంబంధించి బంగారు సంచులను మాయం చేసినట్లు ఉండే సీసీ ఫుటేజీని ఆర్‌ఎం రాజు పోలీసులకు ఇచ్చారు. కానీ అంతకుముందు నెలే (సెప్టెంబరు) బ్రాంచిలో సెంట్రల్ ఆడిట్ జరిగింది. అందులో ఎలాంటి తేడా లేదని క్లియర్‌గా ఉన్నట్లు చూపించారు. వాస్తవానికి పోలీసుల విచారణలో 14 నెలలుగా స్వప్నప్రియ ద్వారా ఈ తతంగం జరిగినట్లు చెప్పారు. అలాంటప్పుడు సెప్టెంబరులో జరిగిన సెంట్రల్ ఆడిట్‌లో ఈ అవకతవకలు బయటపడలేదా అన్నది అనుమానం.
- మొత్తం బ్యాగులన్నీ మార్చింది స్వప్నప్రియే అన్నట్లు చూపించారు. క్యాషియర్ పాత్ర లేకుండా సాధ్యమా.. ఉదంతం జరిగే సమయంలో క్యాషియర్ సురేష్‌ను ఆర్‌ఎం రాజు మూడు చోట్ల పోస్టుల్లో ఉంచారు. అంతే కాకుండా క్యాషియర్ సురేష్‌పై స్వప్నప్రియకు సంబంధించిన వారే దాడి చేశారంటూ అంతకుముందే గార పీఎస్‌లో కేసు నమోదు చేయడం.. అది ఫేక్ అని తేలడం జరిగాయి. దీనివెనకున్నది ఎవరో తేలలేదు.
- పోలీసులకు ఇచ్చిన స్టేట్‌మెంట్లో ఓ నిందితుడు(లోహితాక్షి కన్సల్టెన్సీ తిరుమలరావు) రూ.1.70 కోట్ల వరకు నరసన్నపేట కుంభకోణంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ వ్యక్తి కుటుంబ ఖాతాలకు మళ్లించినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీని వెనక ఆర్‌ఎం పాత్ర ఉందనే అనుమానం ఉంది. దీనిపై కూడా స్పష్టత లేదు.
- కేసు విచారణ జరుగుతుండగా గార బ్రాంచిలో పనిచేస్తున్న సిబ్బందిని అంతా ఒకేసారి ఆర్‌ఎం బదిలీ చేశారు. అది రూల్స్‌కు విరుద్ధం. కేసు పెట్టాల్సింది స్థానికంగా ఉన్న బ్రాంచి మేనేజరే తప్ప ఆర్‌ఎంకు సంబంధం లేదు. కానీ ఆయనే డైరెక్ట్‌గా కేసు పెట్టారు. దీని వెనక కుట్ర ఉందనే వాదనలు ఉన్నాయి.
- స్వప్నప్రియ బతికి ఉన్నప్పుడు అసలేం జరగలేదని చెప్పిన ఆర్‌ఎం ఆమె చనిపోయాక ఏ1గా ఫిర్యాదులో పెట్టడం వెనక కారణమేంటో ఇప్పటికీ సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోయింది.




సాక్షిలో ప్రచురితమైన కథనాలు

బొడ్డపాడులో రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

పలాస: పలాస మండలం బొడ్డపాడులో మార్చి 1న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి ఓ ప్రకటనలో తెలిపారు. బొడ్డపాడు యువజన సంఘం 71వ వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో విజేతలకు షీల్డుతో పాటు నగదు బహుమతులను అందజేస్తామని తెలిపారు. ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30వేలు, తృతీయ బహుమతి రూ.20వేలు, నాలుగో బహుమతి రూ. 10వేలు ఇస్తామన్నారు. క్రీడాకారులు త మ జట్టుతో మార్చి 1న హాజరు కావాలని, క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు ఉన్నాయన్నారు. ఎంట్రీ ఫీజు రూ.300లు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. మిగతా వివరాల కోసం 8309642480 సెల్ నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఉప్పు పరిశ్రమపై దౌర్జన్యం



ఉప్పు మడుల్లో వేసిన రోడ్డును చూపిస్తున్న కంపెనీ మేనేజర్, సిబ్బంది

సంతబొమ్మాళి: నౌపడ ఉప్పు పరిశ్రమపై మూలపేట పోర్టు యాజమాన్యం దౌర్జన్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంపై నౌపడ సాల్ట్స్ 1956 ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ (ఎస్ఎస్ కంపెనీ) యాజమాన్యం, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా, నష్ట పరిహారం చెల్లించకుండా వారి ఆధీనంలో ఉన్న ఉప్పు మడులపై పోర్టు యాజమాన్యం చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను ఎస్ఎస్ కంపెనీ మేనేజర్ దివాకర్ షాతో పాటు ఉప్పు కార్మికులు, సిబ్బంది మంగళవారం అడ్డుకున్నారు. జరిగిన నష్టాన్ని ఎవరు ఇస్తారని ప్రశ్నించారు. అయినా పోర్టు సిబ్బంది అవేమీ పట్టించుకోకుండా రోడ్డు నిర్మాణ పనులను కొనసాగించారు. దీంతో ఏమీ చేయలేక ఎస్ఎస్‌కంపెనీ సిబ్బంది, ఉప్పు కార్మికులు వెనుదిరిగారు. అనంతరం రోడ్డు నిర్మాణానికి తమ ఉప్పు భూములు ఎంత వరకు తీసుకుంటున్నారో పోర్టు యాజమాన్యం వెల్లడించలేదని పేర్కొన్నారు. పోర్టు యాజమాన్యం దౌర్జన్యంగా రోడ్డు వేయడం వల్ల ఉప్పు సాగు ప్రశ్నార్థకంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

చికెన్ వెలవెల.. మటన్ కళకళ



చాలా మందికి ముక్క లేనిదే ముద్ద దిగదు. కానీ బర్డ్ ఫ్లూ భయంతో కోడిని చూస్తేనే వణుకు పుడుతోంది. అందుకే కాస్త రేటెక్కువైనా మటన్ షాపుల వద్ద జనం క్యూ కడుతున్నారు. ఈ దెబ్బతో చికెన్ షాపులు ఇలా వెలవెలబోతున్నాయి.

- సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం



క్లుప్తంగా

వుషు పోటీలకు వర్సిటీ క్రీడాకారులు



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: పంజాబ్‌లోని ఛండీఘడ్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 22 నుంచి 27 వరకు అఖిల భారత మహిళలు, పురుషుల వుషు పోటీలు జరగనున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం తరఫున ఆర్.పావని (ప్రతిభా డిగ్రీ కళాశాల), ఎం.శిరీష (విద్యాధరి డిగ్రీ కళాశాల) ప్రాతినిధ్యం వహించనున్నారు. కోచ్‌గా కె.మురళీ వ్యవహరిస్తున్నారు. క్రీడాకారులను వీసీ కె.ఆర్.రజిని, అధికారులు మంగళవారం అభినందించారు.

ఇన్ఫోసిస్ స్కాలర్‌షిప్‌కు విద్యార్థి ఎంపిక



హేమలతకు ఎంపిక పత్రం అందజేస్తున్న కళాశాల ప్రతినిధులు

టెక్కలి: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ ఇన్ఫోసిస్ అందజేసే స్కాలర్‌షిప్‌కు టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల మొదటి ఏడాది సీఎస్‌ఈ విద్యార్థిని ఎ.హేమలత ఎంపికైనట్లు డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఇన్ఫోసిస్ ఫౌండేషన్ స్టెమ్ స్టార్స్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినికి ఏడాదికి లక్ష రూపాయలు చొప్పున నాలుగేళ్ల పాటు రూ. 4 లక్షలు ఉపకార వేతనం కింద అందజేస్తారని వివరించారు. పదో తరగతి, ఇంటర్‌లో సాధించిన మార్కులతో పాటు ఆర్థిక స్థోమత, ప్రతిభ ఆధారంగా స్కాలర్‌షిప్‌కు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సీఎస్‌ఈ హెచ్‌ఓడీ వై.రమేష్, అసిస్టెంట్ హెచ్‌ఓడీ టి.చలపతిరావు, శాక్ ఇన్‌చార్జి జె.సురేష్‌కుమార్ అభినందించారు.

ట్రాక్టర్‌ను ఢీకొట్టిన మినీ వ్యాన్



రోడ్డుపై బోల్తా పడిన ట్రాక్టర్

టెక్కలి : కోటబొమ్మాళి మండలం బొడ్డపాడు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం భారీ ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జలుమూరు మండలం సురవరం గ్రామానికి చెందిన వండాన శ్రీను టెక్కలి నుంచి కోటబొమ్మాళి వైపు తన ట్రాక్టర్‌తో వస్తుండగా, బరంపురం నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ఓ మినీ వ్యాన్ బలంగా ఢీ కొట్టడంతో ట్రాక్టర్ తొట్టి బోల్తా పడింది. వ్యాన్ ముందు భాగం పూర్తిగా నుజ్జయ్యింది. వ్యాన్ డ్రైవర్ బాదల్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి



ఆమదాలవలస: మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి చెందిన పొన్నాడ సురేష్‌కుమార్(33) ఆమదాలవలస పట్టణానికి చెందిన చిట్టీ వ్యాపారి వేధింపులు తాళలేక ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే. రాగోలు జెమ్స్‌లో చికిత్స పొందుతున్న సురేష్‌కుమార్ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుమారుడి మరణంతో తండ్రి పొన్నాడ దమరకేశ్వరరావు, తల్లి లక్ష్మి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆమదాలవలస ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్–2 పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీఓ సాయి ప్రత్యూష

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఈ నెల 23న జరగనున్న గ్రూప్–2 మెయిన్స్ పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై ఆర్డీవో కె.సాయి ప్రత్యూష తన కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరీక్షల నిర్వహణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కేంద్రాల వద్ద తాగు నీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా, వైద్య సదుపాయం వంటివి సక్రమంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. 144 సెక్షన్ అమలు చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్టీసీ, పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ సహా, పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలల్లో క్రీడల్



సువిశాల క్రీడామైదానం అందుబాటులో ఉన్న శ్రీకాకుళం జూనియర్ కళాశాల



శ్రీకాకుళం న్యూకాలనీ:

- జూనియర్ కాలేజీల్లో కనుమరుగవుతున్న ఫిజికల్ డైరెక్టర్లు
- మొత్తం 38 చోట్ల ఒక్కరూ లేని వైనం
- నష్టపోతున్న విద్యార్థులు
- పట్టించుకోని ప్రభుత్వం

విద్యార్థుల్లో సృజనాత్మకత, నైపుణ్యాలను గుర్తించి, వారిని తీర్చిదిద్దేందుకు శిక్షకులు కావాలి. అందుకు ప్రభుత్వ స్కూళ్లలో పాఠశాల స్థాయిలో పీడీ/పీఈటీలు ఉన్నారు. పాఠశాల స్థాయి తర్వాత జూనియర్ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్లే వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. కానీ జూనియర్ కాలేజీల్లో ఫిజికల్ డైరెక్టర్లు ఒక్కరంటే ఒక్కరు కూడా లేకపోవడం గమనార్హం. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 38 ఉంటే.. పనిచేస్తున్న పీడీలు సున్నా. క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. కానీ ఆ దిశగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వసతులు, శిక్షకులను నియమించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఫలితంగా విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉన్నా శిక్షకులు లేక నిరాశకు లోనవుతున్నారు.కొంతమంది పిల్లలు వివిధ వేదికల్లా రాణిస్తున్నా.. వారి వ్యక్తిగత ప్రతిభతోనే గుర్తింపు పొందుతున్నారు.

నాలుగు గదులకే పరిమితమవుతూ..

జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యలో 10వ తరగతి వరకు పీఈటీలు, పీడీలు విద్యార్థులకు క్రీడల పట్ల మంచి శిక్షణ ఇస్తున్నారు. వారిని ఉన్నత క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. అయితే వారి కృషి అంతా బూడిదలో పోసిన పన్నీరవుతోంది. అందుకు ప్రధాన కారణం ఇంటర్మీడియట్‌లో చేరేసరికి విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చే వారు లేకపోవడం. సర్కారీ జూనియర్ కాలేజీల్లో విద్యార్థులు క్రీడలు, వ్యాయామాలకు దూరమైపోతూ నిరంతనం తరగతుల గదులకే పరిమితం అవుతున్నారు. దీంతో తీవ్రమైన ఒత్తిడి, ఆందోళనకు గురవుతున్నారు. ఇంకొంతమంది డ్రగ్స్, గంజాయి, చెడు వ్యసనాల బారిన పడుతున్నారు. అదే కాలేజీల్లో పీడీలుంటే వ్యాయామం, క్రీడలు, ఆటపాటలపట్ల ఆకర్షితులను చేస్తే మానసిక ఉల్లాసం, ఆనందం కలిగి చెడు వ్యసనాలకు దూరంగా ఉండొచ్చని మానసిక వైద్యనిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆగిపోయిన పదోన్నతల ప్రక్రియ..

పునర్విభజన శ్రీకాకుళం జిల్లాలో 8 నియోజకవర్గాలు, 30 మండలాలున్నాయి. ఈ మండలాల పరిధిలో ఇంటర్మీడియెట్ విద్యను అందిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 38 ఉన్నాయి. వీటిల్లో ఫిజికల్ డైరెక్టర్లు ఒక్కరూ లేరు. పాఠశాలల్లో పనిచేస్తున్న పీఈటీలు, ఎంపీఈడీ కోర్సు పూర్తి చేస్తే పీడీలుగా ఉద్యోగోన్నతులు పొందేవారు. జిల్లా పరిషత్, ప్రభుత్వ, మున్సిపాలిటీ ఉన్నత పాఠశాలల్లో పనిచేసే పీఈటీలు ఉద్యోగోన్నతులపై జూనియర్ కళాశాలలకు వెళ్లేవారు. దీనిపై కోర్టులో కేసు జరుగుతున్నందున ఉద్యోగ పదోన్నతులు రెండు దశాబ్దాలుగా ఆగిపోయాయి. పీఈటీలంతా పాఠశాలల్లోనే ఉద్యోగ విరమణ పొందుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో పీడీలను పాఠశాలల్లో హెచ్‌ఎంలగా పదోన్నతులు కల్పించి నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి పేరిట ఆపద్బాంధవుడిగా నిలిచారు. కానీ న్యాయస్థానాల్లో కేసులు కారణంగా జూనియర్ కాలేజీలకు పీడీలగా మాత్రం ఉద్యోగోన్నతలు పొందలేకపోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఉద్యోగోన్నతుల ద్వారా ఉన్నత పాఠశాలల్లో పీడీలను జేఎల్స్ పీఈగా పదోన్నతులు కల్పించాలని పీడీ, పీఈటీల సంఘ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

క్రీడలకు దూరం..



నేను ఆలిండియా యూనివర్సిటీ హ్యాండ్‌బాల్‌లో గోల్డ్ మెడల్ విన్నర్‌ని. గేమ్స్‌లో ఆసక్తితో ఫిజికల్ డైరెక్టర్ ఉద్యోగంలో చేశాను. స్కూల్స్ వరకే పీడీ, పీఈటీలు ఉన్నారు. కాలేజీలకు పూర్తిగా పీడీలు లేరు. గత ప్రభుత్వం హయాంలో నాకు పదోన్నతి లభించింది. హెచ్‌ఎంగా చేరాల్సి వచ్చింది. క్రీడ లకు దూరమైపోయాను. అదే జేఎల్స్‌గా పదోన్నతులు కల్పించి పీడీలుగా నియమిస్తే జూనియర్ కాలేజీలు సైతం క్రీడలతో కళకళలాడుతుండేవి.

–ఎమ్మెస్ చంద్రశేఖర్, హెచ్‌ఎం, జెడ్పీ హైస్కూల్ పాతటెక్కలి, వజ్రపుకొత్తూరు మండలం

ఉద్యోగోన్నతులు కల్పించాలి..



ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్ నియామకాలను ఉద్యోగోన్నతుల ప్రక్రియ ద్వారా చేపట్టాలి. జూనియర్ కళాశాలల్లో పీడీలు లేకపోవడం వల్ల విద్యార్థులు నష్టపోతున్నారు. క్రీడలకు దూరమైపోతున్నారు. జూనియర్ కాలేజీల్లో పీడీల నియామకాలు జరిగితే పేద విద్యార్థులకు మేలు జరుగుతుంది.

– మొజ్జాడ వెంకటరమణ, పీడీ–పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు



పీడీ లేని శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులు	ఇంటర్ సెకెండియర్ విద్యార్థులు	జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న పీడీలు
38	6383	7883	0

నువ్వలరేవులో విషాదం

- అశ్రునయనాల మధ్య రోడ్డు ప్రమాద మృతుల అంత్యక్రియలు
- బాధిత కుటుంబాలకు పలువురి పరామర్శ



అంత్యక్రియలకు హాజరైన గ్రామస్తులు, బంధువులు

కంచిలి/వజ్రపుకొత్తూరు రూరల్: కంచిలి జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వజ్రపుకొత్తూరు మండలం నువ్వలరేవు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బెహరా ధర్మారావు(31), బెహరా సన్నా అలియాస్ షణ్ముఖరావు(38) మృతిచెందడంతో ఆయా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. ఎదురుగా వెళుతున్న ట్రాక్టర్‌ను తాము ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనంతో ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ధర్మారావు స్వగ్రామంలో టైలరింగ్ చేస్తుండేవాడు. అతని సహాయకుడిగా సన్నా పనిచేస్తుండేవాడు. వీరిద్దరూ రెడీమేడ్ దుస్తుల్ని కుట్టి బరంపురంలోని హోల్‌సేల్ వ్యాపారులకు ఆర్డర్‌పై అందిస్తుండేవారు. ఈ క్రమంలోనే బరంపురం వెళ్లి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.

లబోదిబోమంటున్నకుటుంబాలు..

ధర్మారావుకు భార్య పూజ, కుమారుడు మున్నా, కుమార్తె వర్షిణి ఉన్నారు. సన్నాకు భార్య శృతి, మూడేళ్ల కుమారుడు రోషన్ ఉన్నారు. వీరంతా విషాదంలో మునిగిపోయారు. మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమయ్యారు. మృతుల కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలకు సోంపేట సామాజిక ఆసుపత్రిలో మంగళవారం పోస్టుమార్టం నిర్వహించారు. ఇద్దరు యువకుల మృతితో నువ్వలరేవులో విషాదఛాయలు అలముకున్నాయి. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలు మంగళవారం గ్రామానికి చేరడంతో అశ్రునయానాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు. సర్పంచ్, ఎంపీటీసీలు, మత్స్యకార సొసైటీ సభ్యులు, గ్రామపెద్దలు మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



ధర్మారావు (ఫైల్)



షణ్ముఖరావు (ఫైల్)

ఉద్యోగ భద్రత కల్పించండి




పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న 1962 సిబ్బంది

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): అధికారంలోకి వస్తే లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు గొప్పలు ఊదరగొట్టారని, కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతూ ఉద్యోగులను రోడ్డున పడేస్తున్నారని, తమ ఉద్యోగ భద్రత కల్పించాలని పశుసంచార వాహన ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాకుళం నగరంలో పశుసంవర్ధక శాఖ కార్యాలయం వద్ద తొలగించిన పశుసంచార వాహన ఉద్యోగులు మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంచార పశు ఆరోగ్య సేవల వాహనాలు జిల్లాలో 18 ఉన్నాయని వాటిని ఆదివారం నుంచి నిలిపివేసి వాహనాలను పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకుడికి అప్పగించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయని తెలిపారు.

అదే విధంగా తమకు టెర్మినేషన్ ఆర్డర్స్ కూడా జారీ అయ్యాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.ఉన్నఫలంగా ఉద్యోగం నుంచి తీసేస్తే ఎలా బతకాలని ప్రశ్నించారు. వాహనాలు నిలిపివేయడం అనివార్యమైతే తమను పశుసంవర్ధక శాఖలో కొనసాగించాలని కోరారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



జొన్నవలసలో ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి త్రినాథస్వామి

ఆమదాలవలస: సొంత భూమి గల ప్రతి రైతు ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథస్వామి అన్నారు. జొన్నవలస రైతుసేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. అనంతరం మునగవలసలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల బీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు తదితర పథకాలను నేరుగా పొందే అవకాశం ఉంటుందన్నారు. రైతు ఆధార్ నంబర్, ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలతో రైతు సేవా కేంద్రంలో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని జంతువు

- తీవ్ర గాయాలపాలై వ్యక్తి మృతి



అంబులెన్సులో నర్సింగ్ మహంతి మృతదేహం

సోంపేట: మండలంలోని సుంకిడి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామానికి చెందిన నర్సింగ్ మహంతి (45) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నర్సింగ్ మహంతి కుమారుడు జగదీష్ ఐటీఐ చదువుతున్నాడు. జగదీష్ కొర్లాం వద్దకు బస్సులో రాగా.. కుమారుడిని తీసుకురావడానికి నర్సింగ్ సోమవారం రాత్రి ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. బుసాబద్ర పంచాయతీ వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని జంతువు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో నర్సింగ్ కిందపడి గాయపడ్డాడు. 108 సిబ్బంది వచ్చేసరికే మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు బారువ ఎస్‌ఐ హరిబాబునాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

బుడితి సచివాలయంలో ఒకే ఒక్కడు



వీఆర్వో నుంచి వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ

సారవకోట: మండలంలోని బుడితి సచివాలయానికి ఎంపీడీఓ మోహన్ కుమార్ మంగళవారం ఉదయం 10.10 గంటలకు తనిఖీ చేయడానికి వచ్చారు. ఆ సమయానికి వీఆర్‌ఓ తప్ప ఎవరూ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం 10 నిమిషాల వ్యవధిలో పంచాయతీ కార్యదర్శి హాజరు కాగా ఇతర సిబ్బంది ఏ ఒక్కరూ రాలేదు. ఒక్క బుడితిలోనే కాకుండా అన్ని సచివాలయాలలో ఇదే తంతు నడుస్తుందని పలువురు ఈ సందర్భంగా అభిప్రాయపడుతున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై శిక్షణ

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, డీఆర్‌ఓ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణ, పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ విధానంపై సెక్టార్, ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓల మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. జిల్లాలో 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర చాలా కీలకమని తెలిపారు. ఈనెల 27న జిల్లాలో జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, సి–సెక్షన్ సూపరింటెండెంట్ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్దానంలో ఎలుగు సంచారం



చినకొత్తూరు జీడితోటల్లో సంచరిస్తున్న ఎలుగు

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలో గల వజ్రపుకొత్తూరు, చినకొత్తూరు, కిడిసింగి పరిసర జీడి తోటల్లో గత రెండు రోజులుగా ఎలుగు సంచరిస్తూ రైతుల కంట పడటంతో వారు భయాందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఉద్దాన ప్రజల జీవనాధారమైన జీడి పంట పూత దశలో ఉండటంతో రైతులు తోట పనుల్లో బిజీ బిజీగా తోటల్లోనే గడుపుతున్నారు. తోటకు కంచెలు ఏర్పాటు చేయడం, పురుగు మందులు వేయడం, తదితర పనులు చేసేందుకు తోటకు వెళ్తున్నారు. ఈ సమయంలో ఎలుగు దాడి చేస్తుందన్న భయంతో ఆందోళన చెందుతున్నారు.

ఎలుగుబంటిని తప్పించబోయి వ్యక్తి మృతి

కాశీబుగ్గ: మందస మండలం ముకుందపురం గ్రామ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మందసకు చెందిన జయరాం తన భార్యతో కలిసి స్కూటీపై వస్తుండగా ఒక్కసారిగా ఎదురుగా ఎలుగుబంటి రావడంతో అదుపుతప్పి బోల్తాపడటంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. జయరాం అక్కడికక్కడే మృతిచెందగా.. భార్యకు తీవ్రగాయాలయ్యాయి. మృతదేహాన్ని హరిపురం ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మందస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూలకు చేరిన నిఘా నేత్రం!

- శ్రీకూర్మం క్షేత్రంలో పనిచేయని సీసీ కెమెరాలు
- పట్టించుకోని పాలకులు



మానిటర్ కాలిపోవడంతో ఖాళీగా ఉన్న స్టాండ్

గార : విష్ణువు అవతారాల్లో రెండో అవతారం, ప్రపంచంలో ఇంకెక్కడా నిర్మించకూడదని పురాణాలు పేర్కొన్న ప్రముఖ క్షేత్రం శ్రీకూర్మం. ఇంతటి మహిమాన్వితమైన ఆలయం వద్ద నిఘా మసకబారుతోంది. గతంలో మూలవిరాట్ స్కాన్, తిరునామం పగలగొట్టడం వంటి ఘటనలు నేపథ్యంలో 2012లో హిందుత్వ సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి దరఖాస్తు చేయగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ తర్వాత పలువురు అధికారులు మారినప్పుడు సీసీ కెమెరా వ్యవస్థను పటిష్టం చేశారు. తర్వాత నిర్వహణ కొరవడంతో సీసీ కెమెరా వ్యవస్థ పని చేయడం లేదు. ఆలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో సీసీ ఫుటేజీని పరిశీలించే మానిటర్ వ్యవస్థ పాడైపోయింది. గర్భగుడి లోపలికి, ఆలయానికి వచ్చే భక్తుల రాకపోకలు గమనించేందుకు సీసీలు ఏర్పాటు చేసినప్పటికీ మానిటర్ కొద్దిరోజుల కిందట కాలిపోయింది. ఇప్పటికీ మరమ్మతులు చేయలేదు. వీటన్నింటినీ పర్యవేక్షించాల్సిన ఈవోకు రావివలస, పలాస గ్రూపు ఆఫ్ టెంపుల్స్‌తో పాటు శ్రీకూర్మనాథాలయం బాధ్యతల ఉన్నాయి. ఇక్కడ ఈవోతో మొదలుకొని అందరూ ఇన్‌చార్జిలే. రాత్రిపూట పవళింపు సేవ తర్వాత ఆలయ ప్రాంగణంలో ఎవరూ ఉండకూడదన్న నిబంధన ఉన్నా అమలు కావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించాలని గ్రామస్తులు, భక్తులు కోరుతున్నారు. ఈ విషయమై ఆలయ ఇన్‌చార్జి ఈవో జి.గురునాథరావు వద్ద ప్రస్తావించగా సీసీ టీవీ మానిటర్ కాలిపోవడం వాస్తవమేనని, ఉన్నతాధికారులకు తెలియజేశామని చెప్పారు. తన మొబైల్‌లో లింక్ ద్వారా సీసీ ఫుటేజ్ చూస్తున్నానని తెలిపారు.

వాసుదేవునికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో పూజలందుకుంటున్న వాసుదేవ పెరుమాళ్

మందసలోని వాసుదేవ పెరుమాళ్ బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మంగళవారం పెరుమాళ్ స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. సాయం సంధ్య వేలల్లో అన్నమయ్య సంకీర్తనలు భక్తులకు వీనులవిందు చేశాయి. భక్తులు పెద్ద ఎత్తున స్వామిని దర్శించుకున్నారు. అనంతరం సంగీత విభావరులు ఆకట్టుకున్నాయి.

–కాశీబుగ్గ

సీటు కింద సర్పం



పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీలోని కేటీ రోడ్డులో ఓ వస్త్ర దుకాణం వద్ద మంగళవారం పాము హల్‌చల్ సృష్టించింది. ద్విచక్ర వాహనం సీటు కింద పాము కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అతి కష్టమ్మీద పామును బయటకు తీసినా వేరే వాహనాల్లోకి చొరబడటంతో మరోసారి గందరగోళం ఏర్పడింది. చివరకు పామును దూరప్రాంతానికి తరిమేశారు.

- కాశీబుగ్గ

సాక్షి క్లాసిఫైడ్స్

BUSINESS OFFER

■ మీరు లాభదాయకమైన వ్యాపారాన్ని ప్రారంభించండి, లేడీస్ శానిటరీ ప్యాడ్, బేబి డైపర్ మెషిన్, ప్లాస్టిక్ ఉద్యోగ్ స్థాపించండి, బైబ్యాక్ అగ్రిమెంట్‌తో (ప్రభుత్వంచే ఆమోదించబడినది) సంప్ర॥ 8376001873, 9643010487, 8376089771, 011–25920179 [DA-6239]

WANTED

■ మీ ఇంటి వద్దనే ఉంటూ మీ మొబైల్ ద్వారా ప్రతి రోజు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3,500 సంపాదించుకోండి. వివరాలకు వాట్సాప్‌లో Hi అని మేసేజ్ చేయండి. 82478 08801, 91775 06249 [SCA25001743]

■ కేర్‌టేకర్స్, నర్సులు కావలెను. విజయవాడలో పేషెంట్ల ఇళ్ళ వద్దనే ఉండి చూసుకొనుటకు ఆంధ్ర హోమ్‌కేర్ ఆఫీస్‌కి కావలెను. మంచి జీతం +వ+భో. ✆ 91608 35559, 78158 35561 [B-466]

■ కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40 వేలు, ఫ్రీ రూం+భోజనం. HYD. 7995365999 [HA-99864]

■ ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 20K. Ph: 8977639662, 8977639663 [HA-1901]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.